క్లుప్తంగా

నేటినుంచి ఎస్‌బీఎంలో ప్రవేశాలకు ఆహ్వానం

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి వద్ద ఉన్న ఎస్‌ఎంఐఎంఎస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ ఎంబీఏ ప్రోగ్రామ్స్‌లో శుక్రవారం నుంచి ప్రవేశాలు ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో తమ సంస్థకు చెందిన పోలేపల్లితోపాటు ఇతర ఐదు క్యాంపస్‌లైన ముంబై, నవి ముంబై, ఇండోర్, బెంగుళూరులోనూ దరఖాస్తు చేసుకున్న యువ వృత్తినిపుణులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంబంధమైన నైపుణ్యం, ప్లేస్‌మెంట్ సంసిద్ధత, ప్రపంచవ్యాప్త అభిప్రాయాలపై నిబద్ధతతో మారుతున్న వ్యాపార ప్రపంచానికి భవిష్యత్ నేతలు కావడానికి విద్యార్థులకు తగిన వేదికనందిస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: యువత నైపుణ్యాలు పెంచుకుంటనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోగలరని పీయూ ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏపీఏసీఏ బ్యాంక్ కోసం రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుల కోసం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ అర్హత డిగ్రీతోపాటు పూర్తిస్థాయిలో కమ్యూనికేషన్, కంప్యూటర్, ఇంగ్లీస్ వంటి వ్యాటిపై పట్టు సాధిస్తే సులువుగా ఉద్యోగం సాధించేందుకు అవాకశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పీయూలో చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందడం గొప్ప విషయమని చెప్పారు. కార్యక్రమంలో టీవీఎస్ హెచ్‌ఆర్ కిరణ్, అధ్యాపకులు రాజ్‌కుమార్, అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.

'అధికారులపై నెట్టివేయడం సరికాదు'

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా వైఫల్యం చెందిన ఉద్యోగ జేఏసీ నాయకులు లోలోపల ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ పైకిమాత్రం అధికారుల తీరువల్లనే పరిష్కరించడంలేదని చెప్పడం సరికాదని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జేఏసీ నాయకుల్లో పోరాట పటిమ తగ్గిపోయిందని, మెరుపు ధర్నాలు, నిరాహార దీక్షలు చేయడం మరిచిపోయారని పేర్కొన్నారు. రెండేళ్లుగా పీఆర్‌సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు పరిష్కరించడం వీరివల్ల కాదన్నారు. ఇక నేరుగా ఉద్యోగులే రంగంలోకి దిగాలని, అప్పుడే సమస్యల పరిష్కారానికి ఒకమార్గం ఏర్పడుతుందని తెలిపారు.

'బీసీలను విస్మరించడం తగదు'

పాలమూరు(దేవరకద్ర): బీసీలను విస్మరించడం తగదని ఈ విషయంలో బీజేపీలో బీసీలకు స్థానం లేకుండా చేస్తున్నారని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణసాగర్ ఆరోపించారు. గురువారం ఆయన దేవరకద్రలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటనలో అందరిముందు బీజేపీ రాష్ట్ర కోశాధికారి శాంతికుమార్‌కు వ్యతిరేక నినాదాలు చేశారని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో ఇలాగే జరిగితే బీసీల నుంచి వ్యతిరేకత తప్పదని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వు స్థానాలతోపాటు జనరల్ స్థానాల్లో పోటీచేసి బీసీల ఓట్లు బీసీలే వేసుకునే విధంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ నాయకులు రాములుయాదవ్, ఊషన్న, మహేంద్ర, నరేశ్ యాదవ్, వంశీ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో దొంగల బీభత్సం

జడ్చర్ల: మండలంలోని పెద్దఆదిరాలలో ఉన్న పలు ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంతోపాటు అయ్యప్ప, శ్రీరాజ రాజేశ్వరీ ఆలయాల్లో తలుపుల తాళాలు విరగ్గొట్టి లోపలికి వెళ్లి వస్తువులను ధ్వంసం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా మరి ఎందుకనో హుండీల జోలికి వెళ్లకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. విశయం తెలిసిన వెంటనే గురువారం ఎస్‌ఐ జయప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇనుప స్తంభాల తొలగింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శివశక్తి నగర్‌లోని విద్యుత్ ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఏఈడీ శౌర్యా నాయక్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఇందులో భాగంగా ఇప్పుడు విద్యుత్ తీగలను మార్చడంతోపాటు వీటిని ఏర్పాటు చేయడం గమనార్హం. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భరత్‌కుమార్, మాల్యాద్రి, నరేశ్, ముక్రం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

బీటీకి మోక్షమెప్పుడు?



వర్షానికి కోతకు గురైన నర్సింగ్‌తండా రోడ్డు

- చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారిన తండాల రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న గిరిజనులు



బురదమయంగా మారిన సోమ్లాతండా రోడ్డు

రాజాపూర్: చినుకు పడిందంటేచాలు గిరిజనతండాలకు ఏర్పాటు చేసిన మట్టిరోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి మండలంలోని సోమ్లాతండా, బదిలీతండా, వాచ్చతండా, అంజమ్మతండా, నర్సింగ్‌తండాలకు ఉన్న మట్టిరోడ్లు బురదమయంగా మారి నడవటానికి వీలులేకుండా తయారయ్యాయి. ప్రతిరోజు ఈ తండాల నుంచి రాజాపూర్ మండల కేంద్రంలోని పాఠశాలలకు జడ్చర్ల, షాద్‌నగర్ పట్టణాలకు వివిధ పనులపై వెళ్తుంటారు. అంతేకాకుండా తండాలో రైతులు పండించిన కూరగాయలు, పాలు విక్రయించేందుకు వెళ్తుంటారు. చినుకులు కురిసిన ప్రతిసారి ఇబ్బందులు ఎదుర్కొని తండావాసులు ప్రమాదాల బారిన పడుతున్నామని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారిన తమ తండాల రోడ్లకు మోక్షం లభించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి మట్టిరోడ్లను బీటీలుగా మార్చాలని కోరుతున్నారు.

> **కేసీఆర్ పాయె.. రేవంత్‌రెడ్డి వచ్చే**
>
> 
>
> కేసీఆర్ సర్కార్ పాయె.. రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చె కాని మా తండాలకు మాత్రం రోడ్లు ఏస్తలేరు. వానొచ్చినప్పుడల్లా రాజాపూర్ పోదామన్న రోడ్డు గిట్లుంటే ఎలాపోతాం. అంబులెన్స్ కూడా ఈ రోడ్డును చూసి వస్తలేరు. మా ఓట్లు కావాలి కాని మా తండాలను పట్టించుకోరు.
>
> – పాత్లావత్‌విక్కి, సోమ్లాతండా.

ఫార్మసీ విద్యార్థులు ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉద్యోగాలిచ్చే స్థాయికి ఫార్మసీ విద్యార్థులు ఎదగాలని పీయూ రిజిస్ట్రార్ రమేశ్‌బాబు పేర్కొన్నారు. పీయూలో ఫార్మసీ చివరి సంవత్సరం విద్యార్థులకు మూడో సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఫార్మసీ చదివిన విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని జీవితంలో ఎదగాలని సూచించారు. ముఖ్యంగా ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్టార్టప్‌లు ఏర్పాటు చేసి తోటి వారికి ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు చేసిన డ్యాన్స్ కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకుంది. ఈమేరకు సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, హెచ్‌ఓడీ ప్రభాకర్‌రెడ్డి, చిన్నాదేవి, తరుణ్, ఈశ్వర్‌కుమార్, సోమేశ్వర్, శిలాస్, సురేశ్, స్వాతి, సుజాత, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

చెస్‌తో మనోవికాసం



గండేడ్: విద్యార్థులకు చెస్ కారణంగా మనోవికాసం పెంపొందుతుందని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేశ్, ఎన్నారై ఫోరం కన్వీనర్ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. చలోదోస్త్ – చెస్ ఆడుదాం కార్యక్రమానికి పాలమూరు ఎన్నారై శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గురువారం మండలంలోని లింగాయిపల్లిలో విద్యార్థులకు వారు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంట్లో కుటుంబ సభ్యులు ఆడుకునేందుకు చెస్ ఒక్కటే అనుకూలంగా ఉంటుందన్నారు. చెస్‌కు విస్తృతస్థాయి ప్రాచుర్యం కల్పించాలన్న ఉద్దేశ్యంతో చెస్ బోర్డులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ప్రతిభను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటయ్య, దేవేందర్, నర్సింహులు, భీమయ్య, కృష్ణమోహన్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు సంజీవరెడ్డి, సంధ్య, వీణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్

హన్వాడ: మండలంలోని కిష్టంపల్లి, అంబటోనిపల్లిలో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను గుర్తించిన అధికారులు గురువారం సీజ్ చేశారు. కిష్టంపల్లికి చెందిన రాములు అక్రమంగా నిల్వచేసిన ఇసుకతోపాటు అంబటోనిపల్లిలో నిల్వచేసిన ఇసుకను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకుని చిన్నదర్పల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ కిష్యానాయక్ తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం



జడ్చర్ల(నవాబుపేట): కారుకొండ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి కాకర్లపహాడ్‌కు చెందిన మైనోద్దిన్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఆపరేషన్ అనంతరం ఇంట్లో ఉంటున్నాడు. 1993–94 పదోతరగతి బ్యాక్ విద్యార్థులు పోగుచేసిన రూ.75వేల నగదును బాధితుడికి గురువారం అందజేశారు. నగదు అందించిన వారిలో అరవింద్‌కుమార్, కేసీరెడ్డి లింగయ్య, శ్రీనివాస్‌లు, రాజ్‌కుమార్, కేసీరెడ్డి శ్రీను, శశిధర్‌రెడ్డి, రాజు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి..

జడ్చర్ల: మండలంలోని బోయిన్‌పల్లికి చెందిన ఎల్‌ఐసీ ఏజెంట్ గోవిందాచారీ ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కల్వకుర్తి లియాఫీ నాయకులు గురువారం ఆర్థిక సాయాన్ని అందించారు. ఆయన మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీమా ఏజెంట్లు అకాలమరణం చెందితే తమ యూనియన్ తరఫున రూ.25వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు లియాఫీ అధ్యక్షుడు వెంకటయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాంగోపాల్‌రెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, డివిజన్ నాయకులు అల్వాల్‌రెడ్డి, మల్లయ్య, శ్రీనయ్య, సత్యనారాయణ, మనోహర్, రమేశ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

2, 3వ తేదీల్లో సీఐటీయూ జిల్లా తరగతులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను ఈనెల 2, 3వ తేదీల్లో జడ్చర్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని అంబేద్కర్ కళాభవన్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి పిలుపునిచ్చారు. మొదటిరోజు శిక్షణ తరగతులకు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి, ముఖ్య అతిథిగా హాజరై భారత కార్మిక ఉద్యమ చరిత్ర అంశంపై బోధిస్తారని, మధ్యాహ్నం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, కార్మికులపై ప్రభావం అంశంపై సీనియర్ నాయకుడు కిల్లె గోపాల్ వివరిస్తారని పేర్కొన్నారు. రెండోరోజు ఆదివారం ట్రేడ్ యూనియన్ పనిపద్ధతులు అంశంపై దీప్లా నాయక్, మధ్యాహ్నం వర్క్‌షాప్ కర్తవ్యాలు అంశంపై కురుమూర్తి బోధిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అనుబంధ యూనియన్లు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

జనశిక్షణ సంస్థాన్‌లో స్వచ్ఛతా పక్వాడ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని జనశిక్షన సంస్థాన్‌లో మంగళవారం స్వచ్ఛతా పక్వాడ ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్ఓ శ్రీనివాస్ యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని, ఏదో ఓ అంశంపై శిక్షణ తీసుకుని ఉపాధి మార్గాలను అన్వేషించినప్పుడే దేశం వృద్ధిలోకి వస్తుందన్నారు. జనశిక్షణ సంస్థ డైరెక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత, పచ్చదనం, ముగ్గుల పోటీలు, ర్యాలీలు, క్విజ్‌పోటీలు, అవగాహణ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలని ఎంపీడీఓ జయరాం నాయక్ సూచించారు. గురువారం మండలంలోని పోమాల్, పుట్టోనిపల్లి, తిమ్మయ్యపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆరా తీశారు. పనుల్లో మరింత వేగం పెంచాలని లబ్ధిదారులకు సూచించారు. ఇంటి నిర్మాణం విషయంలో ఇబ్బందులు వస్తే అధికారులకు తెలిపి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు నిర్మించకుండా ఉంటే వారు తమకు అధికారికంగా ఇంటి నిర్మాణం చేపడం లేదంటూ ధ్రువపత్రం అందజేయాలని సూచించారు. దీంతో రెండో విడతలో ఇతర అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ నసీర్ అహ్మద్, ఏపీఓ జ్యోతి, గ్రామస్తులు రమేశ్‌గౌడ్, శ్రీహరి, నరేశ్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

పాలమూరు(దేవరకద్ర): మున్సిపాలిటీ పరిధిలో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు, ఈవో సీత్యానాయక్ భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన వారి ప్లాట్లలో మార్క్ అవుట్ ఇచ్చి మంజూరు పత్రాలను అందజేశారు.

రైతు బొజ్జయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



పాలమూరు(అడ్డాకుల): గుండెపోటుకు గురైన రైతు బొజ్జయ్యను 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆక్సిజన్ అందక మృతిచెందిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మూసాపేట మండలం నిజాలాపూర్‌లో గురువారం రైతు బొజ్జయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బొజ్జయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. రైతు మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహాయాదవ్ ఉన్నారు.

నియంతృత్వ పాలనకు త్వరలోనే చరమగీతం

మహబూబ్‌నగర్ రూరల్: గిరిజనుల హక్కులను సాధించుకునే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని గిరిజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గాంధీ భవన్ ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. ధర్నాలో పాల్గొనకుండా ముందస్తుగా గురువారం తెల్లవారుజామున లక్ష్మణ్‌నాయక్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడే స్వేచ్ఛ లేదా అని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఈ నియంతృత్వ పాలనకు త్వరలోనే చరమగీతం పాడేటట్లు గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వినతి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ శాఖల్లోని అధికారులకు నడిచే వాహనాలకు చెందిన పెండింగ్ బిల్లు వెంటనే ఇవ్వాలని తెలంగాణ ఫోర్ వీలర్స్ డ్రైవర్స్, హైర్ వెహికిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సలాఉద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్‌సీ కార్పొరేషన్ కమిషనర్ శ్రీతిజాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో 34 నెలల బిల్లులు, డీఆర్‌డీఓ కార్యాలయంలోని వాహనాలకు చెందిన 8 నెలల బిల్లులు, మిషన్ భగీరథలో 16 నెలల బిల్లులు, ఫిషరీష్ శాఖలో 11 నెలల, బీసీ అభివృద్ధి శాఖ లో 6నెలల, పీఆర్‌లో 20 నెలల డీఎంహెచ్‌ఓలో 10 నెలల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆయా శాఖల ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు ఎండీ షకీల్, ట్రెజరర్ రాఘవేందర్‌గౌడ్, సంజీవ, సలీం తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు వార్షికోత్సవ పూజలు



పాలమూరు(దేవరకద్ర): మండల కేంద్రంలోని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో గురువారం తొమ్మిదో వార్షికోత్సవ పూజలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి అభిషేకానికి 108 కళశాలతో జలం తీసుకుని మహిళలు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జలంతో ఉన్న కళశాలతో గంగాపూజలు నిర్వహించి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ఆలయంలో లలితా పారాయణం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు సన్నాహాలు



హైస్కూల్ మౌలిక సదుపాయాలపై వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ

- హాజరు కానున్న సీఎం, గవర్నర్
- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: నవంబర్ 27, 28, 29 తేదీల్లో జరిగే బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మలను ఆహ్వానిద్దామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి వెల్లడించారు. గురువారం జడ్చర్ల క్యాంప్ కార్యాలయంలో హైస్కూల్ శతాబ్ది ఉత్సవ కమిటీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ కోరిక మేరకు సీఎం, గవర్నర్‌లతో ఆగస్టు రెండో వారంలో అపాయింట్‌మెంట్ తీసుకుందామన్నారు. ఉత్సవాలలో భాగంగా నవంబర్ 28న పెద్దఎత్తున మ్యూజికల్‌నైట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. మూడు రోజుల ఉత్సవాలకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. వందేళ్లు పూర్తయిన పాఠశాలలో కొన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కృష్ణ ఆయనకు వివరించారు. 1000మంది విద్యార్థులకు పైగా పాఠశాలలో ఉన్నారని, వారి సౌకర్యార్థం టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు డైనింగ్‌హాల్, 2 హైమాస్ట్ లైట్లు వేయించాలని ఆయనను కోరారు. 8 అదనపు గదులు, పూర్వ విద్యార్థుల కోసం గది, మీటింగ్‌హాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అత్యవసరంగా టాయిలెట్ కాంప్లెక్స్, డైనింగ్‌హాల్, హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు హామీ ఇచ్చారు. అదనపు గదులు, డైనింగ్‌హాల్, ఇతర సౌకర్యాలను సీఎం ద్వారా మంజూరు చేయించుకుందామన్నారు. సమావేశంలో చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బి.రవిశంకర్, ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, కమిటీ సభ్యులు పెద్ది బాలకృష్ణ, సయ్యద్ ఇబ్రహీం, గోపాల్, కంచుకోట ఆనంద్, సత్యం, టైటాస్, వెంకటేశ్, మేడిశెట్టి రామకృష్ణ, శ్రీను, సంతోషాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

జడ్చర్ల: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన ఉండాలని, ఆలయాల్లో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. తమ ప్రభుత్వం ఆలయాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు జ్యోతి, ఉమాదేవి, మాజీ మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- డీఎస్పీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం: విద్యార్థులు చట్టాలపై అవగహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రజా భద్రత– పోలీస్ బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. సమాజంలో చట్టబద్ధంగా జీవనం సాగించే వారికి ఎలాంటి ఇబ్బందులు రావని, చట్టాలు ఉల్లంఘించి నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో గొడవలు సృష్టించాలని ప్రయత్నం చేయాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అనంతరం టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ మాట్లాడుతూ.. మహిళలపై గౌరవంగా ఉండాలని, చదువుకునే సమయంలో ప్రతి విద్యార్థి బాధ్యతగా ఉండాలన్నారు. ఉన్నతమైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రధానంగా గంజాయి ఇతర మత్తు పదార్థాలను తీసుకోరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్ భాస్కర్, కళాశాల ప్రిన్సిపాల్ కౌసర్ జహాన్, ఏఎస్‌ఐలు సాయి నిర్మల, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లకు చేరుకున్న పాదయాత్రికులు



జడ్చర్ల టౌన్: తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న వేంకటేశ్వరస్వామి భక్తులు గురువారం సాయంత్రం జడ్చర్ల పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. హైదరాబాద్ పటాన్‌చెరుకు చెందిన రాజు నేతృత్వంలో మొత్తం 25మంది భక్తులు నాగుల పంచమి రోజున మహంకాళి ఆలయం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ప్రతిఏటా నాగుల పంచమి రోజున పాదయాత్ర ప్రారంభించి 16రోజుల్లో తిరుమలకు చేరుకుంటామని రాజు తెలియజేశారు. 21ఏళ్లుగా నిరాటంకంగా ఏటా శ్రావణ మాసంలో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. 17మందితో ప్రారంభమైన యాత్ర 25మందికి చేరుకుమన్నామన్నారు. పాదయాత్రతో వేంకటేశ్వర స్వామి దర్శనం తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా చేసిందని పేర్కొన్నారు. లోకకల్యాణార్థం తాము పాదయాత్రగా స్వామిదర్శనానికి వెళ్తున్నామన్నారు. గురువారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సేదతీరి శుక్రవారం ఉదయం బయలుదేరుతామని తెలిపారు.

'స్థలాలిచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయండి'



మాట్లాడుతున్న రామ్మోహన్

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిష్టియన్‌పల్లి శివారు 523 సర్వేనంబర్‌లో పేదలకు ఇచ్చిన స్థలాలను ఇస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని 2018లో పట్టాలు తిరిగి తీసుకుని నేటికీ డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించలేదని ఇళ్ల స్థలాలు కోల్పోయిన నిర్వాహితుల కమిటీ నాయకుడు రామ్మోహన్ ఆరోపించారు. గురువారం అర్బన్ తహసీల్దార్ ఘన్సీరామ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు కలిగిన పేదలు పట్టాలను అధికారుల సూచనల మేరకు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆ పట్టాలు కలిగిన వారి జాబితా ప్రకారం అనేకమార్లు విచారణలు జరిపి అర్హులను గుర్తించినప్పటికీ నేటికీ డబుల్ బెడ్రూంలు కేటాయించలేదన్నారు. సర్వేనంబర్ 523లో ఇళ్ల స్థలాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేకు ఇదివరకే అనేకమార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఒకవేళ డబుల్ బెడ్రూంలు ఇవ్వకపోయినా ఫర్వాలేదని, కనీసం పేదలకు కేటాయించిన స్థలాలను తిరిగి అప్పగించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో కమిటీ అధ్యక్షురాలు పార్వతమ్మ, ప్రధాన కార్యదర్శి మంగమ్మ, ఉపాధ్యక్షురాలు సైదాబేగం, వహిదాబేగం, మంజుల, గోవిందమ్మ, కోశాధికారి పద్మ పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో బిల్లు పెట్టేదాకా ఉద్యమిద్దాం



మహబూబ్‌నగర్ రూరల్(మెట్టుగడ్డ): పార్లమెంట్‌లో బిల్లు పెట్టేదాకా బీసీలంతా ఏకమై ఉద్యమిద్దామని మహబూబ్‌నగర్ బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో బీసీ మహిళలు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సావిత్రీబాయి పూలే ఆశయసాధనకు బీసీలంతా ఏకంకావాలని, మన అధికారం మన లక్ష్యం నినాదంతో ముందుకు సాగుదామన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేదాకా అందరూ ఏకమై పోరాడుదామని, కేంద్రానికి బీసీల పట్ల నిజమైన ప్రేమ ఉంటే పార్లమెంట్‌లో బిల్లు పెట్టి వారి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. బీసీ మహిళా ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో ఎంతశాతం రిజర్వేషన్ ఇస్తారో కూడా ప్రకటించాలని, లేకుంటే మహిళలు మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మమతా జ్యోతి, మంజుల, వాణి, రాధ, శ్రీదేవి పాల్గొన్నారు.

గోస్వామి తులసీదాస్, మున్షి ప్రేమ్‌చంద్‌కు నివాళి



చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా.బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం గోస్వామి తులసీదాస్, నవలాచక్రవర్తి మున్షిప్రేమ్‌చంద్ జయంతి నిర్వహించారు. హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారి చిత్రపటాలకు ప్రిన్సిపాల్ డా. సుకన్య పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రసంగించారు. గోస్వామి తులసీదాస్, మున్షిప్రేమ్‌చంద్ ఇద్దరూ హిందీ సాహితివేత్తలని అభిప్రాయపడ్డారు. వారిద్దరు తమ సాహిత్యంలో తమ కాలపు సామాజిక, ఆర్థిక పరిస్థితులను చిత్రీకరించారన్నారు. వారిద్దరు వ్యావహారిక భాషకు ప్రాధాన్యతిచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధ్యక్షుడు నర్సింహారావు కల్యాణి, తెలుగు విభాగం అధిపతి నర్సింహులు, అధ్యాపకురాలు పుష్పలత, జగన్, నియాజుద్దీన్, నాగరాజు, నందకిశోర్, వీర్‌ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.